నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

రసూల్‌పురా: సికింద్రాబాద్ డివిజనల్ హాకీంపేట ఎయిర్‌ఫోర్స్ స్టేషన్, తుర్కపల్లి, హనుమాన్‌టెంపుల్, వాటర్‌వర్క్స్ 11 కేవీ ఫీడర్ల పరిధిలో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సికింద్రాబాద్ ఏడీఈ కే. మురళీకృష్ణ తెలిపారు. శనివారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు హాకీంపేట ఎయిర్‌ఫోర్స్ స్టేషన్, ఆర్మీ ఏరియా, మా సంతోషీ కాలనీ, తుర్కపల్లి విలేజ్, కళాసీగూడ, రాధ సత్సంగ్, బ్లూ బర్డ్స్ కాలనీ, రైల్వే కాలనీ పరిసర ప్రాంతాలు, అదే విధంగా మధ్యాహ్నం 2. 30 గంటల నుండి సాయంత్రం 5. 30 గంటల వరకు హనుమాన్ టెంపుల్ ఏరియా, బృందా హస్పిటల్, ఎంసీహెచ్ లైన్, వాటర్‌వర్క్స్ కేన్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

సనత్‌నగర్: ఈఎస్‌ఐ, కుందన్‌బాగ్ సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో కరెంటు సరఫరా ఉండదని గ్రీన్‌ల్యాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు శ్రీనివాసకాలనీ ఈస్ట్, 2ఆర్‌టీ, ఎస్సార్‌నగర్ బస్టాప్ వెనుక ప్రాంతం, గాయత్రీనగర్, మాజీ ఎమ్మెల్సీ కాసాని జ్ఞానేశ్వర్ నివాస ప్రాంతం, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బీఎస్ మక్తా, హుస్సేన్‌నగర్, నిషాంత్ బాగ్ కాలనీ, హనుమాన్ టెంపుల్, సుభానీ మసీదు ఏరియా, ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందని పేర్కొన్నారు.

4 నుంచి పీజీ కోర్సుల ప్రవేశ పరీక్షలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఆగస్టు 4 నుంచి వివిధ పీజీ కోర్సుల ప్రవేశ పరీక్షలు ప్రారంభం కానున్నట్లు సీపీగేట్–2025 కన్వీనర్ ప్రొ.పాండురంగా రెడ్డి శుక్రవారం తెలిపారు. ఆగస్టు 11 వరకు జరిగే ప్రవేశ పరీక్షల టైంటేబుల్, ఇతర వివరాలను త్వరలో వెల్లడించనున్నట్లు పేర్కొన్నారు. 2025–26 విద్యా సంవత్సరానికి ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ ఇతర కోర్సులలో ఇంత వరకు దరఖాస్తుల చేయాని అభ్యర్థులు ఈ నెల 17 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

నోడల్ అధికారిగా అన్నపూర్ణ

సనత్‌నగర్: బోనాల జాతరకు విచ్చేసే శివశక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉండేలా ప్రత్యేక నోడల్ అధికారిని నియమిస్తూ దేవాదాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, చిక్కడపల్లి వెంకటేశ్వరస్వామి దేవాలయం ఈఓ ఎస్.అన్నపూర్ణను నోడల్ అధికారి నియమించింది.

మెట్టుగూడ బోనాలకు ఏర్పాట్లు పూర్తి



సికింద్రాబాద్: సికింద్రాబాద్ మహంకాళి దేవాలయంతోపాటుగా మెట్టుగూడ డివిజన్ పరిధిలో బోనాల వేడుకలు ఈనెల 13,14 తేదీల్లో ఘనంగా జరుగనున్నాయి. మెట్టుగూడ ప్రధాన రహదారిలోని శ్రీనల్లపోచమ్మ దేవాలయంతోపాటు ఆలుగడ్డబావి మహంకాళి దేవాలయం, రెండు కట్టల ముత్యాలమ్మతోపాటు ఈ ప్రాంతాల్లోని మరో ఆరు అమ్మవారి దేవాలయాల్లో బోనాల పండగ నిర్వహించుకోనున్నారు. ఇందుకోసం ఉత్సవ నిర్వాహకులు ఆలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

భక్తులకు అన్నప్రసాదం పంపిణీ



రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్‌లోని ఉజ్జయినీ మహంకాళి ఆలయం వద్ద శుక్రవారం మాణిక్యాలమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షులు కటారి మహేష్, ప్రతినిధులు రమణ, మురళి మోహన్, భూషన్, శేఖర్, ప్రవీణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయం పై బీసీ విద్యార్థి నేతల హర్షం

ఉస్మానియా యూనివర్సిటీ: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల పై రాష్ట్ర క్యాబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ స్వామిగౌడ్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి అన్ని రాజకీయ పార్టీలతో కూడిన అఖిల పక్షాన్ని ఏర్పాటు చేసి రాష్ట్ర గవర్నర్, ప్రధాని నరేంద్ర మోడిని సంప్రదించి పార్లమెంట్‌లో రాజ్యాంగ సవరణ ద్వారా బీసీ 42 శాతం రిజర్వేషన్లను 9వ షెడ్యూల్లో చేర్చాలన్నారు.

సిద్ధమవుతున్న నజరీ నక్షాలు

బూత్‌ల వారీగా గూగుల్ మ్యాప్‌లు



బీఎల్‌ఓలు తాజాగా రూపొందించిన చిలకలగూడ ప్రాంత నజరీ నక్షా..

- ఇంటి నెంబర్ ఆధారంగా మొత్తం వివరాలు
- సులభంగా పోలింగ్ కేంద్రం గుర్తింపు
- బీఎల్‌ఓల మార్పుతో సత్ఫలితాలు
- పకడ్బందీగా ఓటరు జాబితా
- కసరత్తు చేస్తున్న జీహెచ్‌ఎంసీ

సికింద్రాబాద్: సమీప భవిష్యత్తులో ఓటర్లు తమ ఇంటి నెంబర్ ఆధారంగా పోలింగ్‌బూత్ వివరాలు గూగుల్‌ను ఆశ్రయించడం ద్వారా తెలుసుకోవచ్చునని ఎన్నికల అధికారులు చెబుతున్నారు. అంతేకాదు ఒకే బహుళ అంతస్తుల భవనంలో ఎన్ని కుటుంబాలు జీవిస్తున్నా... అందులో ఎందరు ఓటర్లు ఉన్నా సరే.. వారంతా వచ్చే ఎన్నికల నుంచి ఒకే పోలింగ్ బూత్‌లో ఓట్లు వేసుకునే వెసులుబాటు అందుబాటులోకి రానుంది.

◆ ఒకే భవనం ఇంకా చెప్పాలంటే ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు కూడా లోగడ ఓటు వేయడానికి వేర్వేరు పోలింగ్‌బూత్‌లకు వెళ్లాల్సిన పరిస్థితులు ఎదురయ్యేవి. ఇకముందు అటువంటి సమస్యలకు చెక్ పెట్టేందుకు కేంద్ర ఎన్నికల కమిషన్ రూపొందించిన మార్గదర్శక సూత్రాలకు జీహెచ్‌ఎంసీ ఎన్నికల విభాగం అధికారులు కార్యరూపం ఇస్తున్నారు. ఇందుకోసం పోలింగ్ బూత్‌ల వారిగా నజరీ నక్షాలు సిద్ధం చేస్తున్నారు.

నజరీ నక్షా అంటే...?

నజరీ నక్షా అనేది ఉర్దూ పదం. కనిపించే చిత్రం (ఆప్టికల్ మ్యాప్) అని అర్థం. గూగుల్‌లో నిక్షిప్తం చేస్తున్న పోలింగ్ కేంద్రాలు, వాటి పరిధిలోని గృహాలు, అందులోని ఓటర్లు, రూట్‌మ్యాప్ తదితర వివరాలన్నింటికి ప్రతిరూపమే నజరీ నక్షా. ముందే ఎంపిక చేసుకున్న పోలింగ్ కేంద్రానికి సమీపంలోని గృహాలను పోలింగ్ కేంద్రం పరిధిలోకి తెస్తున్నారు. ఆ పరిధిలోని 1400 ఓటర్లను సదరు కేంద్రంలో ఓటు వేసేకునేందుకు అవసరమైన వెసులుబాటును కల్పిస్తున్నారు.

◆ వాస్తవానికి ఈ ప్రక్రియ ఏడేళ్ల క్రితమే పూర్తి చేయాలని ఎన్నికల కమిషన్ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. అప్పట్లో విద్యార్హులైన బీఎల్‌ఓలు లేకపోవడం, సిబ్బంది కొరత తదితర సాంకేతిక సమస్యల ఫలితంగా నేజరీ నక్షాల ప్రకియ ముందుకు సాగలేదు.



ఇంటింటి సర్వే ద్వారా ఓటర్ల వివరాలు తెలుసుకుంటున్న బీఎల్‌ఓలు

కొత్త బీఎల్‌ఓల నేతృత్వంలో..

నజరీ నక్షాల రూపకల్పనకు ముందే జీహెచ్‌ఎంసీ అధికారులు బూత్‌లెవల్ ఆఫీసర్ల (బీఎల్‌ఓ) ప్రక్షాళన చేశారు. నాల్గవ తరగతి ఉద్యోగులపై స్థాయి వారిని బూత్‌లెవల్ ఆఫీసర్లుగా నియమించింది. 58 మంది కొత్త బీఎల్‌ఓలను వివిధ ప్రభుత్వ విభాగాల నుంచి నియమించారు. మొత్తం 220 మంది బీఎల్‌ఓలు వారికి కేటాయించిన ఇండ్లలోకి వెళ్లి సర్వేలు చేస్తూ వివరాలు సేకరిస్తున్నారు.

◆ తద్వారా ఓటర్ల జాబితా సవరణలు, పోలింగ్ కేంద్రాల ఎంపిక, గృహాల వారిగా ఓటర్ల విభజన వంటి ప్రక్రియలను కొనసాగిస్తున్నారు. నియోజకవర్గంలోని ఐదు మున్సిపల్ డివిజన్లలో 2 లక్షల పైచిలుకు ఓటర్లు ఉండగా ఇప్పటి వరకు 20 వేల మంది ఓటర్ల వివరాలు సేకరించి నజరీ నక్షాల్లో నిక్షిప్తం చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

◆ ఓటర్ల పరిశీలన పకడ్బందీగా జరుగుతున్న క్రమంలో ఓటర్లందరూ సహకరించాలని సికింద్రాబాద్ సహాయక ఎన్నికల అధికారి హేమలత కోరారు. యువతీయువకులు తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. బీఎల్‌ఓలను తమ ఇంటి వద్ద కలవలేక పోయిన ఓటర్లు నేరుగా జీహెచ్‌ఎంసీ సర్కిల్ కార్యాలయానికి వచ్చి వివరాలు అందించవచ్చునని చెప్పారు.

బీజేపీ ద్వారానే దివ్యాంగులకు సంపూర్ణ న్యాయం



మాట్లాడుతున్న భరత్‌గౌడ్

సికింద్రాబాద్: దివ్యాంగులకు బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాతే న్యాయం జరిగిందని మహంకాళి జిల్లా బీజేపీ అధ్యక్షుడు భరత్‌గౌడ్ అన్నారు. శుక్రవారం సీతాఫల్‌మండిలోని బీఎస్ఆర్ గార్డెన్‌లో కేంద్ర ప్రభుత్వ సాధికారత మంత్రిత్వశాఖ ద్వారా దివ్యాంగులకు అందించే సహాయ పరికరాలు అందించడం కోసం అసెస్మెంట్ క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన భరత్‌గౌడ్ మాట్లాడుతూ కేంద్ర మంత్రి హోదాలో కిషన్‌రెడ్డి దివ్యాంగుల సమస్యలు ప్రభుత్వానికి వివరించి వారికి న్యాయం జరిగే విధంగా కృషి చేశారని చెప్పారు. కార్యక్రమంలో దివ్యాంగుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కొల్లి నాగేశ్వర్‌రావు, పార్టీ నాయకులు బండపల్లి సతీష్ పాల్గొన్నారు.

మహంకాళి అమ్మవారి ఘటం ఊరేగింపు



అమ్మవారి ఘటానికి పూజలు చేస్తున్న ప్రజలు

బన్సీలాలోపేట్: బన్సీలాల్‌పేట్ డివిజన్‌లో శుక్రవారం చారిత్రాత్మకమైన సికింద్రాబాద్ మహకాళి అమ్మవారి ఘటాన్ని ఊరేగించారు. బ్యాండ్ మేళాల మధ్య అమ్మవారి ఘటం ఊరేగింపు పురవీధుల్లో కన్నుల పండువగా సాగింది. బోయిగూడ, ఆల్‌ఫత్తా హోటల్ పరిసర ప్రాంతాల్లో అమ్మవారి ఘటాన్ని ఊరేగించారు. పెద్ద ఎత్తున మహిళలు అమ్మవారి ఘటానికి పూజలు చేసి సాగ సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

పద్మారావునగర్: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బోయిగూడ రైల్వే బ్రిడ్జి సమీపంలోని శ్రీ సాయిబాబా దేవాలయంలో జరిగిన పూజా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో ప్రయాణిస్తూ తమ జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని కోరారు.

భక్తులు ఇబ్బందులు పడకుండా అన్ని ఏర్పాట్లు: ఎమ్మెల్యే తలసాని

సనత్‌నగర్: ఈ నెల 13వ తేదీన జరిగే మహంకాళి జాతరకు వచ్చే భక్తులు ఎలాంటి ఇబ్బందులకు గరి కాకుండా అన్ని ఏరాట్లు చేస్తున్నట్లు మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. మహంకాళి ఆలయ పరిసరాల్లో వివిధ శాఖల అధికారులతో కలిసి శుక్రవారం పర్యటించి ఏర్పాట్లను పరిశీలించారు. ఏర్పాట్లపై అధికారులను ఆయన పలు సూచనలు చేశారు. అమ్మవారికి వడిబియ్యం పోసేందుకు మహిళలు పెద్ద సంఖ్యలో రావడంతో ఆలయ పరిసరాలు కోలాహలంగా మారాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ బోనాల ఉత్సవాలు మనందరి పండుగ అని, గొప్పగా జరుపుకుందామని కోరారు. మాజీ కార్పొరేటర్లు మల్లికార్జున్‌గౌడ్, అరుణగౌడ్, ఆలయ ఈఓ మనోహర్‌రెడ్డి, డీసీ డాకూనాయక్, ఈఈ సుబ్రహ్మణ్యం, వాటర్ వర్క్స్ డీజీఎం ఆశిష్, తహశీల్దార్ పాండునాయక్, ఎలక్ట్రికల్ డీఈ బ్రహ్మానందం పాల్గొన్నారు.

42 శాతం బీసీ రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చాలి



మాట్లాడుతున్న చిరంజీవులు

ఉస్మానియా యూనివర్సిటీ: బీసీలకు ప్రకటించిన 42 శాతం రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చాలని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం రాష్ట్ర చైర్మన్ టి.చిరంజీవులు అన్నారు. శుక్రవారం ఓయూలో బీసీ స్టూడెంట్స్ ఫెరేషన్ (బీసీఎస్ఎఫ్) ఆధ్వర్యంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు–తక్షణ కర్తవ్యం అనే అంశం పై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. కార్యక్రమానికి బీసీఎస్ఎఫ్ రాష్ట అధ్యక్షులు కొమ్మబోయిన సైదులుయాదవ్ అధ్యక్షత వహించగా చిరంజీవులు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. న్యాయపరమైన చిక్కులు ఎదురవ్వకుండా వెంటనే కేంద్ర ప్రభుత్వం 9వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఓయూ అధ్యాపకులతో పాటు ఆర్ఎస్ అధ్యక్షులు ఆజాద్, ఆర్ఎన్ శంకర్, జంపాల రాంబాబు, వీరబోయిన లింగయ్య, బారి అశోక్‌కుమార్ ప్రసంగించారు.

కాంగ్రెస్ నేతల సంబరాలు

రసూల్‌పురా: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించడంతో కాంగ్రెస్ పార్టీ కంటోన్మెంట్ నియోజకవర్గ నాయకులు శుక్రవారం సంబురాలు నిర్వహించారు. టీపీసీసీ సెక్రటరీ రాజేష్‌యాదవ్ ఆధ్వర్యంలో అన్నానగర్ చౌరస్తాలో టపాసులు కాల్చి ,మిఠాయిలు పంచిపెట్టారు.

గృహిణి అదృశ్యం



రూప (ఫైల్)

చిలకలగూడ: చిలకలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ గృహిణి అదృశ్యమైంది.పోలీసులు తెలిపిన మేరకు.. ప్రకారం వారాసిగూడ ఇందిరానగర్ కాలనీకి చెందిన రాజు, స్వరూప భార్యాభర్తలు. అనారోగ్యంతో పుట్టింట్లో ఉన్న రూప గత నెల 15వ తేదీన వారాసిగూడ కి వచ్చింది. ఈనెల 8వ తేదీన బయటికి వెళ్లిన రూప తిరిగి ఇంటికి చేరలేదు. పలు ప్రాంతాల్లో గాలించినప్పటికీ ఫలితం లేకపోవడంతో భర్త రాజు పోలీసులను ఆశ్రయించాడు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

సికింద్రాబాద్: అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం రాత్రి జరిగింది. జీఆర్‌పీ హెడ్‌కానిస్టేబుల్ పండరి వివరాల మేరకు... ముప్పిరెడ్డిపల్లికి చెందిన చిక్కుడు కృష్ణ (40) అనారోగ్యం కారణంగా జీవితంపై విరక్తి చెంది రాత్రి 11.30 గంటల ప్రాంతంలో మేడ్చల్–డబీల్‌పుర హాల్ట్ సమీపంలోని రైలు పట్టాల మీదకు వచ్చాడు. వేగంగా వస్తున్న నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్ రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు.

యువతిని వేధిస్తున్న పోకిరీలు

అమీర్‌పేట: పెళ్లి సంబంధాల కోసం షాదీ డాట్‌కామ్‌లో పెట్టిన ఫోటోలను టెలిగ్రామ్ గ్రూప్‌లో పోస్టు చేసి వేధిస్తున్న పోకిరీలపై కేసు నమోదు. ఎస్ఆర్‌నగర్ పోలీసులు తెలిపిన మేరకు.. ఎస్ఆర్‌నగర్‌లో ఉండే యువతి షాదీ డాట్‌కామ్‌లో ఫోటోలు, వ్యక్తిగత వివరాలు పెట్టారు. ఆ వివరాలను తీసుకుని కొందరు పోకిరీలు టెలిగ్రామ్ గ్రూప్‌లో పోస్టు చేశారు. యువతికి ఫోన్లు చేయడంతో పాటు వాట్సాప్,ఇన్‌స్టా గ్రాముల్లో ఆమెకు అసభ్యకరమైన సందేశాలు పంపారు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

వ్యక్తి అదృశ్యం



శివకుమార్

చిలకలగూడ: గాంధీ ఆస్పత్రినుంచి ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. చిలకలగూడ పోలీసులు తెలిపిన మేరకు.. మెహదీపట్నానికి చెందిన శివకుమార్, నమ్రత దంపతులు ఈనెల 6న రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. చికిత్స పొందుతూ భార్య నమ్రత మృతి చెందింది. శివకుమార్ గాంధీలో చికిత్స పొందుతున్నాడు.ఈనెల 9న టిఫిన్ చేస్తానని ఆసుపత్రి నుంచి బయటకు వెళ్లిన శివ కుమార్ (31) తిరిగి వార్డుకు రాలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మంత్రి పొన్నంకు నేతల కృతజ్ఞతలు



లాలాపేట: స్థానిక సంస్థల ఎన్నికల్లో బలహీన వర్గాలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకమైందనీ, దీన్ని స్వాగతిస్తున్నట్లు సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ఆలకుంట లింగయ్య అన్నారు. ఈ మేరకు శుక్రవారం బీసి సంక్షేమ శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్‌ను, కేశవరావు, ఇతర మంత్రలు, కాంగ్రెస్ పెద్దలను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు.

నీటి కాలువల పనుల పరిశీలన



బౌద్ధనగర్: బౌద్ధనగర్ డివిజన్ రోడ్ నెంబర్ – 8లో జరుగుతున్న నీటి కాలువల పనులను శుక్రవారం స్థానిక కార్పొరేటర్ కంది శైలజ శ్రీకాంత్ ఏఈ లావణ్యతో కలిసి పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ... స్థానికులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆమె ఆదేశించారు.

ప్రజలకు ఇబ్బంది కలుగకుండా పకడ్బందీ చర్యలు



రోడ్డు మరమ్మతు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి

అడ్డగుట్ట: వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి శ్రీనివాస్ తెలిపారు. అడ్డగుట్టలో రోడ్ సేఫ్టీ డ్రైవ్ కార్యక్రమాన్ని శుక్రవారం జీహెచ్‌ఎంసి అధికారులతో కలిసి ఆమె ప్రారంభించారు. డివిజన్ పరిధిలో గుంతలమయంగా మారిన రోడ్లకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసి డీఈ పద్మలత, ఏఈ తివారి పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శిగా వెంకటేశ్వర్లు



డా.వెంకటేశ్వర్లు

ఉస్మానియా యూనివర్సిటీ: బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఓయూ కాంట్రాక్టు అధ్యాపకులు డాక్టర్ చిన్నాల వెంకటేశ్వర్లు నియమితులైయ్యారు. ఓయూ నిజాం కాలేజీలో ఫిజిక్స్ పని చేస్తున్న ఆయనకు శుక్రవారం జాతీయ అధ్యక్షులు, ఎంపీ ఆర్.కృష్ణయ్య నియామకపు పత్రాన్ని అందచేశారు.

పీజీ కాలేజీలో భక్తిశ్రద్ధలతో బోనాల పండుగ



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని సికింద్రాబాద్ పీజీ కాలేజీలో బోనాల పండుగను శుక్రవారం విద్యార్థులు, అధ్యాపకులు, ఉద్యోగులు భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. టీపీసీసీ మీడియా అండ్ కమ్యూనికేషన్ చైర్మన్ సామ రామ్మోహన్ రెడ్డి, ప్రిన్సిపల్ ప్రొ.గంగాధర్ హాజరయ్యారు.

ఆలయ ప్రాంగణం.. భక్తజన సందోహం

సనత్‌నగర్: లష్కర్ బోనాల జాతర ముందు వచ్చే శుక్రవారం మినీ బోనాల జాతరను తలపించింది. ఆలయ పరిసరాలు భక్త జనసందోహంతో కిక్కిరిశాయి. వేలాదిగా భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఒడిబియ్యం, పసుపు, కుంకుమలను అమ్మవారికి సమర్పించారు. బోనాల ఉత్సవాలకు ముందు శుక్రవారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.



బోనాల జాతర ముందు వచ్చే శుక్రవారం మహంకాళి ఆలయాన్ని పోటెత్తిన భక్తజనం..

పర్యావరణ పరిరక్షణను సామాజిక బాధ్యతగా గుర్తించాలి



చిలకలగూడ: పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యతగా గుర్తించి ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని పరిరక్షించాలని సీతాఫలమండి కార్పొరేటర్ సామల హేమ పిలుపునిచ్చారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మార్కండేయ నగర్ పార్కులో శుక్రవారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో బయోడైవర్సిటీ డిప్యూటీ డైరెక్టర్ అనిల్ కుమార్, సర్కిల్ మేనేజర్ మహేశ్వరి, సూపర్వైజర్ సురేష్ పాల్గొన్నారు.

మురుగు సమస్యను పరిష్కరించండి



లాలాపేట: లాలాపేటలోని బొడ్రాయి నుంచి మెయిన్ రోడ్డు వరకు గల రోడ్డులో నెలకొన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని లాలాపేట వాసులు జలమండలి మేనేజర్‌ను కోరారు. శుక్రవారం శాంతినగర్‌లోని జలమండలి కార్యాలయంలో మేనేజర్ మురళిని కలిసి సమస్యను వివరించారు. తరచుగా డ్రైనేజీ మ్యాన్ హోళ్లు పొంగి రోడ్డుపై మురుగు నీరు ప్రవహిస్తోందన్నారు. ప్రభుత్వ బాలికల పాఠశాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఓయూలో జాగృతి నేతల సంబరాలు



ఉస్మానియా యూనివర్సిటీ: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల పై క్యాబినెట్ నిర్ణయం పట్ల జాగృతి నేతలు సంబరాలు జరుపుకున్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల పట్ల శుక్రవారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట బాణ సంచాకాల్చి స్వీట్లు పంచి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో డా.ఎల్చాల దత్తాత్రేయ, మన అశోక్‌యాదవ్, బొడ్డుపల్లి లింగం, ప్రజాపతి, శ్రావణ్, నాగరాజు, శరత్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

రైలుకింద పడి యువకుడి ఆత్మహత్య

సికింద్రాబాద్: వేగంగా వస్తున్న రైలు కిందపడి జనగామ జిల్లాకు చెందిన యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం అర్థరాత్రి చోటుచేసుకుంది. జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ కే.నారాయణ తెలిపిన మేరకు.. జనగామ జిల్లా బాణాపురంకు చెందిన గుజ్జేరి కృష్ణ కుమారుడు వినోద్‌కుమార్ (23) నగరంలోని జోమాటో కంపెనీలో రెండేళ్లుగా ఉద్యోగం చేస్తున్నాడు, ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ సమీపంలోని డౌన్ ట్రాక్ వద్ద రైలు ఇంజన్‌కు ఎదురు వెళ్లి అక్కడికక్కడే మృతి చెందాడు. తొలుత గుర్తు తెలియని యువకుడి మృతిగా కేసు నమోదు చేసుకున్న పోలీసులకు శుక్రవారం ఉదయం ఘటన స్థలంలో లభించిన డ్రైవింగ్ లైసెన్స్ ఆధారంగా మృతుడి వివరాలు తెలుసుకున్న పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమంగా ఎల్‌పీజీ గ్యాస్ రీఫిల్లింగ్

సనత్‌నగర్: ఎటువంటి అనుమతి లేకుండా ప్రమాదకర స్థితిలో పెద్ద సిలిండర్ల నుంచి చిన్న సిలిండర్లలోకి ఎల్‌పీజీ వంట గ్యాస్‌ను రీఫిల్లింగ్ చేస్తున్న వ్యక్తిపై బేగంపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన మేరకు.. బేగంపేటలోని బాలంరాయి అంబేద్కర్‌నగర్‌కు చెందిన మొహమ్మద్ అల్తాఫ్ (40) అక్రమంగా ఎల్‌పీజీ గ్యాస్‌ను చిన్న సిలిండర్లలోకి రీఫిల్లింగ్‌చేస్తూ విక్రయిస్తున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు అకస్మికంగా దాడి చేశారు. నిందితుడి వద్ద నుంచి ఒక పెద్ద సిలిండర్‌తో పాటు ఆరు చిన్న సిలిండర్లు, గ్యాస్ ఫిల్లింగ్ చేసే యంత్రం, బరువు తూగే యంత్రం, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

నడుచుకుంటూ వెళ్తూ కుప్పకూలి వ్యక్తి మృతి

సనత్‌నగర్: నడుచుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తి ఉన్నట్టుండి కిందపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. బేగంపేట పోలీసులు తెలిపిన మేరకు.. బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్యారడైజ్ కూడలిలో గల సంతోష్ దాబాలో బేగంపేట బాలంరాయికి చెందిన ప్రవీణ్‌కుమార్ ప్రభాకర్ (50) గురువారం ఉదయం నడుచుకుంటూ వెళుతుండగా క్లాసిక్ గార్డెన్స్ రోడ్డులో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. స్థానికులు చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ప్రవీణ్‌కుమార్ మృతి చెందాడు.

ఉద్యోగం ఇప్పిస్తానంటూ రూ.3.70 లక్షలు టోకరా

సనత్‌నగర్: ఐటీ కంపెనీలో ఉద్యోగం ఇప్పిస్తానంటూ ముగ్గురి నుంచి రూ.3.70 లక్షలు వసూలు చేసి మోసం చేసిన వ్యక్తిపై బేగంపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన మేరకు.. కూకట్‌పల్లిలో నివాసం ఉంటున్న శ్రీనివాస్‌కు మిత్రుడైన ఎం.రమేష్ ద్వారా బేగంపేటకు చెందిన సీహెచ్.ప్రవీణ్‌కుమార్ పరిచయమయ్యాడు. బేగంపేటలోని గుమడెల్లి టవర్స్‌లో గల పీఎస్ కొలాబరేషన్స్ సంస్థకు తాను సీఈఓనని ప్రవీణ్‌కుమార్ పరిచయం చేసుకున్నాడు. తన సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగాలిప్పిస్తానని నమ్మించాడు. అతనిపై నమ్మకంతో శ్రీనివాస్‌తో పాటు అతని మిత్రులైన సాయి కిరణ్, పూర్ణచందర్‌లు కలిసి మొత్తం రూ.3.70 లక్షలను ప్రవీణ్‌కుమార్‌కు అప్పగించారు. ఉద్యోగం లేకపోవడంతో బాధితులు బేగంపేట పోలీసులను ఆశ్రయించారు.